
# రైతులకు 'శని'గ

- శనగల రాయితీలో కోత విధించిన కూటమి సర్కార్
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 40 నుంచి 80 శాతం రాయితీ
- ప్రస్తుతం 25 శాతానికే పరిమితం చేసిన కూటమి ప్రభుత్వం
- బహిరంగ మార్కెట్‌లోనే తక్కువ ధరలకు శనగలు



శనగలు



రైతులకు రాయితీపై ఏపీ సీడ్స్ ద్వారా అందించే శనగల బస్తాలు(ఫైల్)

ప్రత్తిపాడు: రైతే రాజు.. ఇది రైతు ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకునే కూటమి సర్కారు కర్షకులపై కపట ప్రేమను ప్రదర్శిస్తుంది. మేలు చేస్తున్నామని పైకి చెబుతూనే.. తెలియకుండానే కోత పెడుతుంది. ఇప్పటికే అన్నదాత సుఖీభవను అమలు చేయకుండా చోద్యం చూస్తున్న ప్రభుత్వం .. రబీలో రైతులకు సబ్సిడీపై ఇచ్చే శనగల రాయితీలోనూ కోత విధించింది. ప్రత్తిపాడు మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 6,624 ఎకరాల్లో పత్తి, మిర్చి, పొగాకు, వరి పంటలు సాగు చేశారు. రబీ సీజన్‌లో 8,100 ఎకరాల్లో మినుము, శనగ, మొక్కజొన్న పంటలు పంటలు సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వాటిలో 5,200 ఎకరాల్లో శనగ సాగు చేసే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

**గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు ఉదారంగా రాయితీలపై శనగలు పంపిణీ చేశారు. సీజన్‌ను బట్టి నలభై శాతం సబ్సిడీపై రైతులకు శనగలను ఏపీ సీడ్స్ ద్వారా అందించారు. ప్రకృతి విపత్తులు వంటివి సంభవించిన సమయంలో అయితే ఏకంగా 80 శాతం రాయితీపై శనగలను రైతులకందించి వారికి భరోసాగా నిలిచారు. దీంతో రైతులు అకాల వర్షాలు, వరదలతో ఒక పంటను నష్టపోయినా, ఎనభై శాతం రాయితీపై రెండవ పంట సాగుకు శనగలు ఇవ్వడం వారికి ఎంతగానో ఉపకరించింది.

**సబ్సిడీని 25 శాతానికి కుదించి..**

ఇదిలా ఉంటే ప్రస్తుతం కూటమి సర్కారు శనగల రాయితీని 25 శాతానికి కుదించింది. బెంగాల్‌గ్రామ్ జెజి-11 రకం కేజీ ధర రూ.94 కాగా రూ. 23.50 సబ్సిడీ పోగా రైతులు రూ.70.50 చెల్లించాలి. అదే విధంగా బెంగాల్‌గ్రామ్ కేఏకే-2 రకం కేజీ రూ.121 కాగా రైతులు రూ. 90.75 చెల్లించాలి. రూ.30.25 రాయితీ కింద మినహాయిస్తారు. ఏపీసీడ్స్‌కు నిర్ణీత రుసుం చెల్లించి శనగలు పొందాల్సి ఉంటుంది.

**బహిరంగ మార్కెట్‌లోనే తక్కువ..**

ప్రభుత్వం ఏపీ సీడ్స్ ద్వారా అందిస్తున్న శనగల ధరలు బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే ఎక్కువగా ఉన్నాయి. బయట దుకాణాల్లో 20 కేజీల బస్తా రూ. 70 కన్నా తక్కువకే అందుబాటులో ఉంది. దీంతో రైతులు రైతు సేవ కేంద్రాలకు బదులు ప్రైవేట్ వ్యాపారుల వద్దకే వెళ్లి అక్కడ తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతుసేవ కేంద్రాలకు వచ్చి శనగలు అడిగే నాథులు లేకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులు కూడా శనగలు తెప్పించని పరిస్థితి చోటు చేసుకుంది. మొత్తమ్మీద శనగల సబ్సిడీలో కోత పెట్టి రైతుల జేబుకు ప్రభుత్వం చిల్లు పెట్టిందనే చెప్పాలి. గత ప్రభుత్వంలో ఏటా సీజన్‌లో శనగలను అధికారులు తెప్పించి రైతులకు అందుబాటులో ఉంచే వారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక్క క్వింటా కూడా తెప్పించని పరిస్థితి స్థానికంగా కనిపిస్తుంది.

### రైతులకు కావాలంటే తెప్పిస్తాం



ఇరవై ఐదు శాతం రాయితీపై ప్రభుత్వం అందించే శనగలు కావలసిన రైతులు తమ కార్యాలయంలో లేదా రైతు సేవ కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలి. అవసరాన్ని బట్టి ఏపీ సీడ్స్ ద్వారా శనగలను తెప్పించి రైతులకు అందిస్తాం. ఇప్పటికే విషయాన్ని రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులకు తెలియజేశాం. గనికపూడి రైతులు కావాలని ముందుకు వచ్చారు. వారి కోసం 8.6 క్వింటాళ్ల ఇండెంట్ పెట్టి తెప్పిస్తున్నాం.

కె.అరుణకుమారి, ఏవో, ప్రత్తిపాడు

## క్లుప్తంగా

### పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కమిషనర్ రమేష్‌బాబు



పొన్నూరు: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని 18, 19వార్డులలో ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వార్డులలో ఎక్కడ చెత్త నిల్వ చేరకుండా చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. కాలువల్లో పూడికతీత పనులు నిరంతరం చేపట్టాలన్నారు. 19 వార్డులో పార్కును సందర్శించి నిర్వహణ సక్రమంగా లేదని, వెంటనే పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సహించేది లేదని హెచ్చరించారు.

### నైపుణ్య గణన నిర్ణీత సమయంలో చేయాలి

చేబ్రోలు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్య గణన సర్వేను సిబ్బంది నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.లలిత అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి బుధవారం రెండు బ్యాచ్‌లుగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సిబ్బంది నైపుణ్య గణన చేపట్టాలన్నారు. శిక్షణ కోఆర్డినేటర్ షేక్ బాజి మాట్లాడుతూ సర్వేలో వచ్చిన అంశాల ఆధారంగా ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందిస్తుందన్నారు. ప్రతి రోజు ఒక్కొక్కరూ 30 ఇళ్లను సర్వే చేయాలన్నారు. ఈఓపీఆర్డీ టి.ఉషారాణి పాల్గొన్నారు.

**నైపుణ్య గణనపై అవగాహన ఉండాలి**

పెదకాకాని: ప్రజల వ్యక్తిగత నైపుణ్యాలను గుర్తించి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం నైపుణ్య గణన-2024 కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

### వరి సాగులో మెలకువలు పాటించాలి



పొన్నూరు: మండలంలో వరి పంట సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ శాఖ చేసే సూచనలను తప్పక పాటించాలని ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని జడవల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వరి పంట పూత దశలో ఉందని, ఈ సమయంలో అగ్గి తెగులు నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ట్రై సైక్లో జోన్ 75శాతం ఎస్పీ120 గ్రాములు ఒక ఎకరం వరి పంటకు పిచికారీ చేస్తే నష్టాలు ఉండవని చెప్పారు. మినుము, జొన్న, మొక్కజొన్న, పెసర పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. డిసెంబరు 31 వరకు పంటలకు ప్రీమియం చెల్లించి పంటలకు బీమా చేయించుకోవాలని సూచించారు.

**అగ్గితెగులుపై అప్రమత్తంగా ఉండాలి**

రేటూరు(కాకుమాను): ఈఏడాది వరి సాగు చేస్తున్న రైతులు పంటపై అగ్గితెగులు ఆశించకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఏఓ కె.కిరణ్మయి సూచించారు.మండలంలోని రేటూరు,అప్పాపురం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

### ప్రజాస్వామ్యంలో పొలిటికల్ గవర్నెన్స్

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు: ప్రజాస్వామ్యంలో పొలిటికల్ గవర్నెన్స్ నడుస్తుందని, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. మండల కేంద్రం పెదనందిపాడులో మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే అధికారుల తీరుపై మండిపడ్డారు. ఆయా శాఖల అధికారులు తమ పార్టీ నాయకులను కార్యక్రమాలకు పిలవకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. శాఖల వారీగా సమీక్ష జరుపుతున్న సమయంలో ఐసీడీఎస్ సీడీపీఓ వి.సుజాతదేవికు క్షేత్రస్థాయిలో చేపట్టే పనులు పార్టీ నాయకులు చూపించాలని కోరారు. ఇప్పటి నుంచి ప్రతి శాఖ అధికారులు గ్రామ పార్టీ పొలిటికల్ లీడర్లతో ఒక సారి సమావేశమవ్వాలని, అయ్యా గ్రామాల్లో వారి సహకారాన్ని కోరాలని స్పష్టం చేశారు. మా ప్రతినిధులంతా క్షమించాలని ఇక్కడ మిమ్మల్నందరినీ అసౌకర్యానికి గురిచేశారని, కనీసం కుర్చీలు కూడా వెయ్యలేని స్థితిలో అధికార వ్యవస్థ ఉన్నందుకు ఒక రకంగా నేనూ సిగ్గుపడుతున్నానని, ఇక నుంచి ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా చూస్తానని ఎమ్మెల్యే చెప్పారు. విజయనగరం జిల్లా పార్వతీపురం నియోజకవర్గ ఎమ్మెల్యే బి.విజయచంద్ర నా శిష్యుడేనని, తనకు టిక్కెట్ ఇప్పించానని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చెప్పారు. ఉపాధి పనులు ఆశించిన రీతిలో జరగడం లేదని పేర్కొన్నారు.

### పంచారామాలకు ప్రత్యేక బస్సులు

పొన్నూరు: కార్తిక మాసం పురస్కరించుకుని పంచారామాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ అజిత కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రసిద్ధ శైవక్షేత్రాలు అమరావతి, సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం ఒకే రోజులో దర్శనాలు అయ్యే విధంగా బస్సులు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ బస్సులన్నీ ప్రతి శని, ఆదివారాల్లో రాత్రి 20, 21 గంటలకు పొన్నూరు డిపో నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి పొన్నూరుకు తిరిగి వస్తాయని తెలిపారు. ప్రముఖ శైవక్షేత్రాలైన యాగంటి, మహానంది, శ్రీశైలంకు ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని తెలిపారు. వివరాలకు 7382897094, 9866812611, 08643-244441 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### నేడు ఆచార్య ఎన్జీ రంగా జయంతి

పొన్నూరు: లాంలోని ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ వర్సిటీలోని గురువారం రంగా ట్రస్టు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య ఎన్జీ రంగా జయంతి నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు రామినేని కిషోర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు.

## జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు విజ్ఞాన్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు

చేబ్రోలు: మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ తెనాలి పట్టణంలో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన 4వ ఏపీ సీనియర్ క్యోరుగి తైక్వాండో చాంపియన్‌షిప్-2024లో విజ్ఞాన్ విద్యార్థులు ఐదు బంగారు పతకాలు, 6 రజత పతకాలు, 4 కాంస్య పతకాలు సాధించారని వెల్లడించారు. బంగారు పతకాలను బీహెచ్ శామ్యూల్ చార్లీ, డి.హర్షిత్, ఎ.భవిష్య, వి.నిఖిల, ఎండీ కరిష్మ, రజత పతకాన్ని ఎం.ఎం. ఆషంటే నవంబర్ చివరి వారంలో అసోం రాష్ట్రంలోని గౌహతిలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ అభినందించారు.

## పెదకాకాని శివాలయ వైదిక ఆగమ కమిటీ ఏర్పాటు



పెదకాకాని శివాలయంలో వైదిక ఆగమ కమిటీ సభ్యులతో డీసీ శ్రీనివాస్

పెదకాకాని: శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో వైదిక ఆగమ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. శివాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీఓఎంఎస్ నంబరు 223 రెవెన్యూ(దేవదాయశాఖ-1) డిపార్టుమెంట్, కమిషనరు దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి హాలులో అర్చకులు, వేద పండితులతో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సమావేశం ద్వారా అర్చకులు, వేద పండితుల అందరి ఆమోదంతో వైదిక ఆగమ కమిటీ ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. వైదిక ఆగమ కమిటీ అధ్యక్షుడిగా ఆలయ స్థానాచార్యుడు పాత్తూరి సాంబశివరావు, కమిటీ సభ్యులుగా ఆలయ ఉప ప్రధాన అర్చకులు చదలవాడ జాలయ్య, పేటేటి ధనమహేశ్వరప్రసాద్, ముఖ్య అర్చక చదలవాడ శివశంకరశాస్త్రి, వేదపండితుడు వ్యాకరణం గణపతిశర్మలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఆలయంలో పూజ విధానాలకు, ముఖ్యమైన మతపరమైన విషయాలపై నిర్ణయాలు తీసుకోవడంలో, ఆలయ ఆచారాలు, సేవలను నిర్వర్తించే విధానం, స్థిరీకరణ యాగాలు, కుంభాభిషేకాలు, ఇతర వైదిక కార్యక్రమాల నిర్వహణకు ముహూర్తాలు, పండుగలు, నూతన సేవలు ప్రవేశపెట్టడానికి ప్రతిపాదించడం కోసం వైదిక ఆగమ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని ఆలయ ఉప కమిషనరు శ్రీనివాసరావు వివరించారు.

## అధికార పార్టీ నేతల అండతో రెచ్చిపోయిన వీఆర్‌ఓ

- అక్రమ మైనింగ్ జరిగే ప్రతి గ్రామానికి ఆమె ఇన్‌చార్జి
- ఇటీవల జరిగిన ట్రాన్స్‌ఫర్స్‌లో చక్రం తిప్పిన వైనం
- తహసీల్దారు కార్యాలయంలోనూ తనదే హవా

గుంటూరు రూరల్: అధికార పార్టీ అండతో వీఆర్‌ఓ హసీనా రెచ్చిపోయినట్లు సమాచారం. ప్రజల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసి మండల స్థాయి అధికార పార్టీ నేతలకు కొంత ముట్టజెప్పినట్లు ఆరోపణలున్నాయి. అక్రమ మైనింగ్ గ్రామాలు తానే ఇన్‌చార్జి వీఆర్‌ఓగా పనిచేస్తుండేదని, ఆమె ఏమి చెబితే మిగిలిన అధికారులు అది చేయాల్సిందేనని ఆమె ప్రవర్తన చూసిన అధికారులే చెవులు కొరుక్కుంటున్నారు.

**వీఆర్‌ఓల బదిలీల్లో ఆమెదే హవా**

ఇటీవల నిర్వహించిన సాధారణ వీఆర్‌ఓల బదిలీల్లో ఆమెది హవా. నియోజకవర్గం ప్రజా ప్రతినిధి కార్యాలయం నుంచి ఏ గ్రామానికి ఏ వీఆర్‌ఓను పంపాలి, ఎవరిని ట్రాన్స్‌ఫర్ చేయాలి, బదిలీకి ఎంత మొత్తం తీసుకోవాలి వంటి కార్యకలాపాలన్నీ ఈ వీఆర్‌ఓ కనుసన్నల్లోనే జరిగాయని రెవెన్యూ విభాగం అధికారుల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది. బదిలీలకు రూ.లక్షల్లోనే వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక చిన్నపాటి సమస్యల నుంచి రియల్ ఎస్టేట్ వెంచర్ల వరకూ చెప్పాలంటే ప్రతి పనికి ఒకరేటు.

### ఎప్పటి నుంచో ఆరోపణల వెల్లువ

తహసీల్దార్ కార్యాలయంలో ఆమె చెప్పింది జరుగుతుందనే ప్రచారం బాగా ఉంది. కింది స్థాయి సిబ్బందిని చులకనగా మాట్లాడటం సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలతో కనీసం మాట్లాడటానికి కూడా అవకాశం ఇచ్చేదికాదని, అంతా నగదు లావాదేవీలేనని ప్రజలు చెబుతున్నారు. గతంలో వీఆర్‌ఓ హసీనాపై మంగళగిరి ప్రాంతంలో రూ.5 కోట్ల విలువైన భూ వివాదం ఉన్నట్లు తెలిసింది. ఆ వ్యవహారంలో కూడా ఆమె పెద్ద మొత్తంలో తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## విద్యార్థుల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలి




కలెక్టరేట్ ప్రధాన ద్వారం ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు

### ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల డిమాండ్

గుంటూరు వెస్ట్: విద్యార్థుల న్యాయమైన కోర్కెలు తీర్చడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ ఎటుట ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందని పేర్కొన్నారు. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చిన హామీల్లో స్పష్టత లేదని చెప్పారు. వసతి దీవెన నిధులు రూ.3,480 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీని కారణంగా చదువులు పూర్తయిన విద్యార్థులకు ఆయా కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని ఆరోపించారు. ఉన్నత విద్య, ఉపాధి కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో అర్భాటంగా తీసుకొచ్చిన డిగ్రీ హానర్స్ విద్యార్థులకు శాపంగా మారిందని వాపోయారు. దీనికి సంబంధించిన పరీక్ష అంతా గందరగోళంగా ఉందని చెప్పారు. కాస్మోటిక్, మెస్ బిల్లులు నెలలు తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని పేర్కొన్నారు. అన్న క్యాంటీన్లకు ఒక్కొక్కరికి రూ.96 కేటాయిస్తుందన్నారు. విద్యార్థుల హాస్టళ్లకు మాత్రం రూ.53, పాఠశాలలకు రూ.46 చెల్లిస్తున్నారని చెప్పారు. విద్యార్థులంటే ఈ ప్రభుత్వానికి చిన్నచూపని వెల్లడించారు. ధర్నాలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, ఉపాధ్యక్షులు నవిత, సహాయ కార్యదర్శి యశ్వంత్, అభి, జమీర్ పాల్గొన్నారు.

## రైతన్న ఆశలపై మూషికాల దాడి

- ఆందోళనలో అన్నదాతలు
- నాశనం అవుతున్న వరి పంట
- పట్టేవారిని ఆశ్రయిస్తున్న రైతులు



వరి పొలాల్లో ఎలుకల కోసం ఎర బుట్టలు పెడుతున్న దృశ్యం



పొగ యంత్రాల ద్వారా కలుగుల వద్ద ఎలుకలను పడుతున్న దృశ్యం

చేబ్రోలు: ప్రతికూల వాతవరణ పరిస్థితుల కారణంగా ఆటుపోటులతో సతమతమవుతున్న రైతులకు తాజాగా మూషికాల విజృంభణతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వరిపైరు పొట్ట దశ, కంకిదశలో ఉండటం వలన వరి కర్రలు, గింజల్లో తీపి రావటంతో ఎలుకల దాడి పెరిగింది. దాడి వలన ఎకరానికి దాదాపుగా 10 నుంచి 15 సెంట్ల వరకు పంట నష్టం జరుగుతుంది.

**రైతుల్లో కలవరం..**

చేబ్రోలు మండలంలో ఈ ఏడాది సుమారు 16 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. మంచాల, చేబ్రోలు, తోట్లపాలెం, శ్రీరంగపురం, వడ్లమూడి, వేజండ్ల, శేకూరు, వీరనాయకునిపాలెం గ్రామాల్లో ఎలుకల దాడి ఎక్కువగా ఉంది. అనేక వ్యయ ప్రయాసల కూర్చి సాగు చేపట్టిన రైతులకు ప్రస్తుతం ఎలుకల బెడద రైతులను కలవరపెడుతుంది. వరి పంటను నాశనం చేసే నాలుగు రకాల ఎలుకలు పలు విధాలుగా పంటను నాశనం చేస్తున్నట్లు అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

**దాడిలో రకాలు..**

చిట్టెలుక, చుంచెలుక, పందికొక్కులు, మెత్త(గూని) పంటను నాశనం చేసే ప్రధానమైన ఎలుకల రకాలు. వీటిలో పందికొక్కులు పెద్దవిగా ఉండటం వల్ల వేటగాళ్లు బుట్టల బోన్లు పెట్టినప్పుడు మీసాలు తగిలి బోన్లలోని బెడ్లు పడిపోవడం వలన దొరక్కుండా పోతాయి. వీటి సంతతి కూడా ఎక్కువగానే ఉంది. చిట్టెలుకలు మాత్రం ఆహారం కోసం వెతికేటప్పుడు బుట్టల్లో పడే అవకాశం ఎక్కువగా ఉంది. చుంచెలుకలు రెండు రకాలు. నాగ చుంచులు, పెద్ద చుంచులు. నాగ చుంచులు మూతి పొడవుగా ఉండి సన్నగా ఉంటాయి. పెద్ద చుంచులు మూతి పొడవుగా ఉండి సైజు కూడా పెద్దవిగా ఉంటాయి. ఇవి కూడా బుట్టలో త్వరగా దొరికిపోతాయి. మెత్త ఎలుకలు మాత్రం మాగాణి పొలాల్లో అరుదుగా ఉంటాయి. మెట్ట పొలాల్లో ఎక్కువగా ఉండి మినుము, పత్తి, మిర్చి లాంటి పైర్లను నాశనం చేస్తుంటాయి.

**వీటిని ఎలా పడతారంటే..**

ప్రస్తుతం ఎకరం పొలంలో వంద బుట్టలు పెడితే 15-20 ఎలుకల వరకు పడుతున్నాయి. ఎలుకలు పట్టేందుకు బుట్టల్లో ఎలుకలకు ఇష్టమైన వడ్లగింజలు, ఉల్లిపాయ ముక్కలు, బూంది, శనగ విత్తనాలు లాంటివి వాడతారు. ఎకరంలో ఇప్పటికే వంద ఎలుకలకు వరకు పట్టిన పరిస్థితి. బుట్టల ద్వారా ఎలుకలు పడితే ఒక్కొక్క ఎలుకకు రూ.20 ఇస్తుండగా కావడికి అంటే వంద బుట్టలు పెడితే రూ.500 రైతుల వద్ద నుంచి ఎలుకల పట్టేవాళ్లు వసూలు చేస్తున్నారు. బుట్ల పెట్టినప్పటికి దొరక్కుండా పోతున్న ఎలుకలను పట్టేందుకు వివిధ రకాల పద్ధతులను ఉపయోగిస్తున్నారు. తవ్వటం, పొగ పెట్టి పట్టడం రెండు రకాలుగా చేస్తున్నారు. ఎలుకల కలుగలను గుర్తించి వాటిని తవ్వి ఎలుకలను పట్టుకుంటారు. మరో పద్ధతిలో ఎలుకల కన్నాల్లో గడ్డి పెట్టి పొగ యంత్రాల ద్వారా లోపలకు పొగ పంపిస్తారు. దీని వలన కలుగులోకి పొగ పోవటంతో లోపల ఉన్న ఎలుకలకు ఊపిరి ఆడక లోపల ఉన్న ఎలుకలు చచ్చిపోతాయి. కలుగులను పలుగులతో తవ్వి లోపల ఉన్న ఎలుకలను లెక్కించి ఒక్కో ఎలుకకు చొప్పున డబ్బులు వసూలు చేస్తారు. పందికొక్కులు ఎక్కువగా ఉన్న పొలంలో వరి దుబ్బులను నరికేస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే పెరిగిన పెట్టుబడి రేట్లతో రైతులు సతమతమవుతుండగా, ఆరుగాలం శ్రమించి పంట చేతికి వచ్చే సమయంలో ఎలుకల దాడితో మరింత పెట్టుబడి పెరిగి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రోజుకు 20వరకు పడుతున్నాయి

ముదురు వరిపైరులో ఎలుకల బెడద ఎక్కువగా ఉంది. లేత వరిపైరులో పెద్దగా లేదు. రోజుకు వంద ఎలుకబుట్టలు పొలంలో పెడితే 20-25 వరకు బుట్టలో పడుతున్నాయి. కొన్ని పెద్ద ఎలుకలు బుట్టలను కూడా వెనుకవైపుగా కొట్టి నష్టపరచటంతో పాటు చట్రాలను కూడా లాక్కెళ్తున్నాయి.

– ఎలుకల వేటగాడు

## వీవీఐటీలో అన్వేషణ- 2024



నూతన ఆవిష్కరణలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెదకాకాని: సృజనాత్మక ఆవిష్కరణలు, విమర్శనాత్మక ఆలోచనలు ప్రోత్సహించడమే అన్వేషణ- 2024 ముఖ్య ఉద్దేశమని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. సాంకేతిక విద్యార్థులలో నూతన ఆవిష్కరణలను, ఆలోచనలను ప్రోత్సహించేందుకు గాను అఘస్త్యా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన అన్వేషణ- 2024 కార్యక్రమాన్ని బుధవారం వీవీఐటీ ఐఎస్, ఐయూసీఈఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ కార్యక్రమంలో భాగంగా 25 బృందాల విద్యార్థులు వారి ఆవిష్కరణల ఆలోచనలను, నమూనాలను ప్రదర్శించారు. న్యాయనిర్ణేతలు హాజరైన ప్రొఫెసర్ కేఎస్‌వీఆర్ కుమార్, అన్వేషణ సంధానకర్త మల్లేష్ బట్టు విద్యార్థులు రూపొందించి ఆవిష్కరణల నమూనాలకు తగు సూచనలు అందించారు. ప్లాస్టిక్ అరికట్టడం, ఆటోమెటిక్ వాటర్ క్లీనింగ్ సిస్టమ్, సోలార్ కార్ ఆవిష్కరణల నమూనాలు అన్వేషణ గ్రాండ్ ఫినాలేకు ఎంపిక కాబడ్డాయని అన్వేషణ సంధానకర్త మల్లేష్ బుట్టు తెలిపారు.

## చిప్స్‌లో ఔషధ మొక్కల ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

గుంటూరు రూరల్: మండలంలోని చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఔషధ మొక్కల ప్రదర్శన నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ ప్రదర్శనలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాధర్ మాట్లాడుతూ మన దైనందిన జీవితంలో ఎన్నో ఔషధ మొక్కలను ఇంట్లో కానీ లేదా మందుల తయారీలోగాని విరివిగా వాడటం నిత్యం మనం చూస్తూనే ఉన్నామన్నారు. కానీ వాటి ప్రయోజనాలు నేటికి ఎందరికో తెలియదని అటువంటి ఔషధ మొక్కలను వాటి ప్రయోజనాలను ప్రతి ఒక్కరికి తెలియజేయటం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రదర్శనలో సిబార్ డెంటల్ కళాశాల, జేకేసీ కళాశాల విద్యార్థులు పాల్గొని ఔషధ మొక్కల ప్రాముఖ్యతను తెలుసుకున్నారు.

## రైల్వే లైన్‌కు భూములు ఇస్తాం..

రాజధానిలో ప్లాట్లు ఇవ్వండి

పెదకాకాని: నూతన రైల్వే లైన్ ఏర్పాటుకు అవసరమైన భూములు ఇస్తాం భూమి ఇచ్చిన రైతులకు రాజధానిలో ప్లాట్లు ఇవ్వాలని రైతులు అధికారులను కోరారు. పెదకాకాని మండలం, నంబూరు రైల్వేస్టేషన్ నుంచి రాజధాని అమరావతి మీదుగా ఎర్రుబాలెం వరకూ నూతన రైల్వేలైన్ ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ ప్రక్రియలో భాగంగా పెదకాకాని మండలానికి సంబంధించి పెదకాకాని, కొప్పురావూరు గ్రామాలకు చెందిన రైతుల భూములు సుమారు 33 ఎకరాలు సేకరిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు సర్వే నంబర్లు కూడా ప్రకటించారు. భూ సేకరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం కొప్పురావూరు గ్రామంగా గ్రామ సర్పంచి ఆలా సాంబశివరావు అధ్యక్షతన బుధవారం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రైతులందరూ రైల్వేలైన్ ఏర్పాటుకు భూములు ఇచ్చి సహకరిస్తాం, రాజధానిలో ప్లాట్లు ఇవ్వాలని కోరారు. రైతుల విన్నపాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని పంచాయితీ కార్యదర్శి రాయేలు తెలిపారు.